ప్రజాశక్తి

ఆదివారం 20 జులై 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే లక్ష్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి- మార్కాపురం

ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని, ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యానికీ, పర్యావరణానికీ ప్రమాదమన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలు సాధ్యమైనంతవరకు గుడ్డ, నారతో తయారు చేసిన సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇస్తున్న దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్ విషయంలో ఎక్కువ రికవరీ చేస్తూ, చురుకుగా వ్యవహరిస్తూ, మెరుగైన పనితీరు చూపిన సిబ్బందికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక అవార్డు ఇస్తామన్నారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులుగా ప్రత్యామ్నాయాల వినియోగంపై ప్రజలు దష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించ కుండా ఆదేశాలు ఇచ్చామన్నారు. కలెక్టరేట్ నుంచే దీనిని ప్రారంభిస్తు న్నామన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగ రహిత మార్కాపురం ఆవిష్కరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యలతో ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ కొంత మార్పు వచ్చిందని, దీనిని మరింత

▶ 2లో

ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఊపందుకోని రియల్ ఎస్టేట్

- నిర్మాణ రంగంలోనూ అదే నిస్తేజం
- భూముల విలువ పెంపుతో మరో భారం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోలేదు. మళ్లీ తిరోగమనం వైపు నడుస్తోంది. కారణాలేమైనా కొద్ది నెలలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చతికలపడింది. ఇపుడు అసలు అమ్మకాలు లేవంటున్నారు. ధరలు పడిపోయాయి. ఇంకా చెప్పాలంటే భూముల క్రమ విక్రయాలు దాదాపుగా తగ్గిపోయాయి. నిర్మాణ రంగంలోనూ నిస్తేజం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతి రాజధానిగా ప్రకటించి అక్కడ నిర్మాణాలపై దృష్టి సారించారు.ప్రభుత్వం ఏర్పాటైన కొద్దినెలల్లో భూముల వ్యాపారం బాగా నడిచింది. అమరావతి చుట్టుపక్కల జిల్లాల నుంచి వెళ్లిన కొందరు వ్యాపారులు, ప్రముఖులు భూములను కొన్నారు. వైసిపి హయాంలో కొన్నవాటిని భారీ లాభాలకు అమ్ముకున్నారు. అదే ప్రభావం కొద్దికాలం జిల్లాలోనూ నడిచింది. రియల్ఎస్టేట్ వ్యాపారం కొంత ఊపందుకుంది. క్రయవిక్రయాలు పెరిగాయి. ఆదాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈఏడాది ఫిబ్రవరి నుంచి భూముల విలువను పెంచింది.రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఆ మేరకు పెరిగాయి. అయితే ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తిరోగనమనం వైపు నడుస్తోంది. ఒంగోలు పట్టణంలోని మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు సమీపంలో

నాలుగు నెలల క్రితం గది నాలుగు లక్షలు పలికింది. ఇపుడా ధరకు కొనడం కష్టంగా మారింది. చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాల్లోనూ ఇదే ధర చెప్పారు. ఇపుడు ఎవరైనా ప్లాటు అమ్ముకోవాలని భావించి అమ్మకానికి పెడితే మూడు లక్షలు అంటున్నారు దళారులు. కొనేవాళ్లు లేరని చెబుతున్నారు. మొన్నటి వరకూ బాగానే ఉన్న వ్యవసాయభూముల ధరలబుూా పడిపోయాయి. వందలాది ఎకరాలు సేకరించి కొందరు అమ్మకానికి పెడుతుంటారు. ఇలాంటివి కూడా ఇపుడు ధరల్లేవంటున్నారు. ఒక్కసారిగా ఎందుకు పడిపోయిందనేదీ స్పష్టత లేదు.ప్రస్తుతం ధరలు పడిపోయాయని రియల్ఎస్టేట్ వర్గాలు చెబుతున్నారు. మధ్య తరగతి వర్గాలకు ఆదాయం కనిపించడం లేదు.రైతులు నష్టాల్లో ఉన్నారు.వాణిజ్యపంటలైన పొగాకు, మిర్చి, శనగ సాగులో లాభాల్లేవు. నష్టమే వస్తోంది. పొగాకు అమ్ముకోవడానికి రైతులు పడుతోన్న పాట్లు చూస్తున్నాం. వ్యవసాయంలో సానుకూలత లేదు.ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామాల్లో కీలకవర్గం చేతిలో డబ్బుల్లేవు. దీనిప్రభావం రియల్ ఎస్టేట్‌రంగంపైనా పడింది. మరోవైపు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ నిస్తేజం కొనసాగుతోంది. చదువుకున్న యువతకు ఉద్యోగాలు రావడంలేదు.నిరుద్యోగులు పెరుగుతున్నారు.ఉద్యోగాలు వస్తే గ్రామాల్లో కుటుంబాలకు ఆదాయం కనిపిస్తుంది. ఇలా వచ్చే

▶ 2లో

పనులు చేసి.. బిల్లురాక..

- రూ 40 కోట్ల మేర బకాయిలు
- పల్లెపండుగ రహదార్ల నిధుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల సందర్భంగా ఉపాధి హామీ నిధులతో జిల్లాలో చేపట్టిన రహదారుల పనులు ఊసూరుమనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టహాసంగా గ్రామాల్లో చేపట్టిన రహదారి పనులు బిల్లులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో రూ .110 కోట్లతో 881 పనులను ప్రారంభించారు. ఇందులో మొదటి విడతగా 656 పనులను, రెండవ విడతలో 225 పనులను చేపట్టారు. దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా రహదారులు, సైడు కాలువ పనుల నిర్మాణాలు చేపట్టారు. టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించారు. టెండర్లు పక్రియ లేకపోవడంతో ఆ పనులను ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ నేతలే చేపట్టారు.గత ఏడాది నవంబరులో పనులు ప్రారంభించారు. డిసెంబరు మొదటివారం వరకూ బిల్లులు రూ.8 కోట్ల మేర బిల్లులు చెల్లించారు.దీంతో గ్రామాల్లోనూ రోడ్ల నిర్మాణ పనులుచేపట్టారు.గతేడాదిడిసెంబరునుంచి బిల్లులు నిలిచిపోయాయి. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, గ్రామస్థాయి టిడిపి నేతలు దిగాలుపడ్డారు. జిల్లాలో మొదటి విడతగా పర్చూరు నియోజకవర్గంలో రూ. 23.86 కోట్లతో 186 పనులు చేపట్టారు. అద్దంకి నియోజకవర్గంలో రూ.19.10 కోట్లతో 191 పనులు, చీరాల నియోజకవర్గంలో రూ.4.10 కోట్లతో 79 పనులు,రేపల్లె నియోజకవర్గంలో రూ.9.70 కోట్లతో 70 పనులు, బాపట్ల నియోజకవర్గంలో రూ.7.54 కోట్లతో 66 పనులు, వేమూరు నియోజకవర్గంలో రూ.11.11 కోట్లతో రూ.64 పనులు చేపట్టారు. ఈ పనులు మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లులు వస్తాయన్న ఆశతో జిల్లాలో మొత్తంగా రూ. 66 కోట్ల విలువైన 424 పనులు పూర్తి చేశారు. అందుకు గానూ రూ.8 కోట్ల బిల్లులు మాత్రమే వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ బిల్లులు నిలచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, టిడిపి నేతలు గ్రామాల్లో పర్యటించాల్సి రావడంతో పల్లెపండుగ రహదార్ల నిధుల బిల్లుల సమస్య ఇబ్బందికరంగా ఉంటుందని పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గత వారం రూ.18 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. పల్లెపండుగ రహదార్లకు సంబంధించి రూ.40 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో జిల్లాలో ఇంకా 457 పల్లె రహదార్ల పనులు నిలచిపోయాయి. రహదారి పనులు ఉపాధి హామీ నిధులతో చేపట్టినప్పటికీ ఎక్కడ కూడా ఉపాధి కూలీలకు పనులు కల్పించలేదు. ఉపాధి కూలీలకు ఏడాదిలో కనీసం 100 రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉంది. ఉపాధి హామీ చట్టం ద్వారానే పనులను గుర్తించారు. పండ్ల తోటలు, గోకులాల నిర్మాణాలు, నీటి ఎద్దడి

▶ 2లో

ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రహదారి

స్మార్ట్ మీటర్లను బహిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని, వాటిని బహిష్కరి ంచాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారులు తేల్చి చెప్పారు. సిఐటియు జిల్లా కార్యాల యంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఎఐఎఫ్ టియు (న్యూ) జిల్లా కార్యదర్శి ఎంఎస్. సాయి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి సి హెచ్.పద్మ పాల్గొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన 176 వాగ్దానాలలో విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. కొత్తగా ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.9,412 కోట్ల భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ ఎంఎల్ జనశక్తి జిల్లా కార్యదర్శి డివిఎన్.స్వామి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు లబ్ధిదారులకు ఆర్థిక భారంగా మారతాయని తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేస్తుందని విమర్శించారు సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్‌సింగ్ కాలనీ తోపాటు పలు చోట్ల స్మార్ట్ మీటర్లను అడ్డుకున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, ప్రజలు జిల్లా వ్యాప్తంగా అర్జీలు సమర్పించి నిరసన తెలియజేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య ,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె. జయంతి బాబు ,పౌర సంఘాల సమాఖ్య నాయకులు జి.రమేష్, ఐఎఫ్‌టియు నాయకులు విజయసారథి, సుల్తాన్‌బాషా ,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం , ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి , శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి పి.కల్పన, కె. హనుమంతరావు ,ఐఎల్‌పి జిల్లా కన్వీనర్ దాసరి సుందరం, నాయకులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, ఎల్.రాజశేఖర్ , ఎం.అయ్యపరెడ్డి , వీరస్వామి , విజయసారథి, మున్వర్ బాషా, చుంచు శేషయ్య, ఆల్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య ,సుబ్బారావు, రామకష్ణ , దాసరి సుందరం తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఊపందుకోని రియల్ ఎస్టేట్

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయాలు కూడా రియల్ఎస్టేట్ రంగంలోకి వచ్చేవి. ఇవి కూడా ఆగిపోయాయి. పరిస్థితులు సజావుగా లేనందున భూములపై పెట్టుబడులుపెట్టే డాక్టర్లు, విద్యాసంస్థల యజమానులు, రాజకీయనాయకులు కూడా వెనుకాముందూ ఆలోచిస్తున్నారు. ఈ పరిణామాలు నిర్మాణ రంగంపైనా పడ్డాయి.అపార్టుమెంట్లు నిర్మాణంలో ఉన్నా కొనుగోళ్ళు వేగంగా లేవు. కొనేవాళ్ల కరువయ్యారు. చాలా అపార్టు మెంట్లలో ప్లాట్లు ఖాళీగానే ఉంటున్నాయి. నగర శివార్లలో నిర్మాణంలో ఉన్న విల్లాల్లోనూ పూర్తిగా కొనుగోళ్లు జరగలేదని సమాచారం. నిర్మాణ రంగంలో సానుకూలత లేనందున అనేక రంగాలపైనా దాని ప్రభావం పడుతోంది.ఉపాధి కూడా తగ్గుతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆగిపోయాయి. నగదు చలామణి తగ్గుతోంది. అనేక వ్యాపారాల్లోనూ వేగం లేదు. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ రంగంలో నిస్తేజం కనిపిస్తోంది.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం కూరగాయల మారెట్‌లోని దుకాణాలను సందర్శిం చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని షాపుల యజమానులకు సూచించారు. వీటి వలన కలిగే అనర్థాలను వివరించారు. మున్సిపాలిటీలో ఉత్తమ పనితీరు చూపుతున్న ఐదుగురు శానిటేషన్ సిబ్బందిని మంత్రి డోలా, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల సన్మానించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన అవగాహన ర్యాలీని ప్రారంభి ంచారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గడియారం స్తంభం సెంటర్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. పర్యావరణాన్ని కాపాడుకునే విషయంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తామని ర్యాలీలో పాల్గొన్న వారితో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జడ్పి సిఇఒ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ డివిఎస్.నారాయణ, తహశీల్దారు కె.చిరంజీవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, పివి.కృష్ణారావు పాల్గొన్నారు.

పనులు చేసి.. బిల్లులు రాక..

(మొదటి పేజీ తరువాయి)

నివారణకు చెక్ డ్యాంలు, నీటి కుంటలు నిర్మించి భవిష్యత్తులో నీటి ఎద్దడి లేకుండా చేయాల్సి ఉంది. ఇంకుడు గుంతల ఏర్పాటు, గ్రామాల్లో అవసరమైన చోట్ల సిమెంట్ రోడ్లు, డ్రెన్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జిల్లాకు మంజూరైన 881 పనుల్లో అత్యధికంగా సిమెంట్ రోడ్ల పనులు చేపట్టారు.గ్రామాల్లో గోకులాల నిర్మాణాలు చేపట్టారు. వాటికి సంబంధజంచిన విడుదల కాలేదు.దీంతో ఏమి చేయాలో పాలు పోక పనులు చేసిన ఆవేదన చెందుతున్నారు.

పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల శుభ్రపరుస్తున్న ఎస్ఐ, సిబ్బంది

పోలీస్ స్టేషన్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి-తర్లుపాడు

నెలలోని ప్రతి మూడో శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర' కార్యక్రమాన్ని తర్లుపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్త చెదరాలను ఎస్ఐ, సిబ్బంది స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మన దినచర్యలో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడటం వల్ల వాతావరణం కలుషితమై ప్రకృతికి, జీవాలకు చాలా నష్టం వాటిల్లుతుందని తెలిపారు. సామాజిక బాధ్యతతో ప్రతి పౌరుడు పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని, మన తోటి వారికి కూడా తెలియజెప్పడం నైతిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడుతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి దిశగా అడుగులు: మంత్రి

ప్రజాశక్తి-మార్కాపురం

సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో మంత్రి డోలా

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చొరవ చూపుతుందని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. మండలంలోని బోడపాడు గ్రామంలోఉపాధి హామీ చట్టం ద్వారా రూ.35 లక్షల వ్యయంతో బోడపాడు నుంచి ఎస్సీ పాలెం వరకు నిర్మించిన సిమెంటు రహదారిని మంత్రి డోలా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో రహదారులన్నీ అభివృద్ధి చెందుతాయని భరోసా ఇచ్చారు. మార్కాపురం చెరువుకట్ట మార్గం కూడా బాగోలేదని చెప్పడం జరిగిందని, దాని అభివృద్ధికి ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ గ్రామ టిడిపి నాయకుడు బొగ్గ శేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, కుందురు కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఎస్సీ బాలికల వసతి గృహంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి బాలికలతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి పరిశుభ్రతను పరిశీలించారు. ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. రక్షిత నీరు సక్రమంగా లేదని, దాన్ని సరిచేసుకోవాలని సూచించారు. వసతి గృహంలో సమస్యలు ఉంటే ఫిర్యాదు బాక్సులో లేఖ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ అన్సారియా విద్యార్థినులకు సూచించారు.

పంట సాగులో యాజమాన్య పద్ధతులు

ప్రజాశక్తి-తర్లుపాడు

ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన-2025 కింద ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు సరియైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వివి శేషమ్మ అన్నారు. మండలంలోని తాడివారిపల్లి గ్రామంలో రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయ అధికారిని పి జోష్ణదేవి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏవో శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, వరి, కంది, మొక్కజొన్న, సజ్జ, టమోటా, మిరప, పంటలలో విత్తనం చేసే దగ్గర నుంచి పంటకోత వరకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి జీవన ఎరువుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం వివిధ పంటల్లో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గూర్చి కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్, విఏఏలు వెంకటేశ్వరరెడ్డి, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే భవిష్యత్ తరాలకు రక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పర్యావరణ పరిరక్షణే భవిషత్ తరాల రక్షణ అని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి పరిశుభ్రతను జీవనశైలిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పునర్వినియోగ పదార్థాలను ప్రోత్సహించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని ప్లాస్టిక్ వాడకండి-ప్రకృతిని కాపాడండి, పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నాసర్‌రెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు, టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, సుధాకర్, మాబు, శేషాద్రి, ఇస్మాయిల్, బాషా, చంటి, రఫీ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుశాలలో 'సుపరిపాలన'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు శనివారం యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల గ్రామంలో 44వ బూత్ తెలుగుదేశం పార్టీ నాయకులు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు.

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.74/2024

Between:-

కర్రి భాస్కర రెడ్డి S/o.బ్రహ్మరెడ్డి, డోర్‌నెంబర్ 2-53/2, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, పిన్ కోడ్.533346 ...వాది

మరియు

1. బోణం రమణయ్య S/o పేరయ్య, గవర్నమెంట్ హైస్కూల్ ఎదురుగా, మెయిన్ రోడ్, అంబేద్కర్ నగర్, రాజుపాలెం, లక్ష్మీపురం గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా పిన్ కోడ్:523226, ...ప్రతివాదులు

పై నెంబరు దావా గ్రందమునకు గాను ప్రతి వాది హాజరు నిమిత్తము మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్స్ పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకముగా సదరు కోర్ట్ సమన్స్ త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.01-08-2025** ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయముగా గాని లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపు కోనవలెను, లేనియెడల సదరు పిటిషన్ ను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయమైనది.

టి.వి.వి.రమణమూర్తి
అడ్వకేట్
దుప్పలపూడి,సెల్.9652736367(4)

డాక్యుమెంట్ పోయినది

దేవరాజు గట్టు వెంకటసుబ్బయ్య తండ్రి డి.చిన్న వెంకట సుబ్బయ్య నేను ప్రస్తుతం గిద్దలూరు 8వవార్డులోని శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాను మా సొంత గ్రామం కృష్ణంపల్లె నుండి కొమరోలుకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యంలో మాఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ NO1003/2000 కొమరోలు బస్టాండ్ నందు పోయినవి ఎవరికైనా కనిపించినచో ఈఫోన్ నెంబరతో సంప్రదించగలరు.

ఇట్లు.
దేవరాజు గట్టు వెంకటసుబ్బయ్య
కృష్ణంపల్లె గ్రామం, కొమరోలు మండలం
ప్రకాశం జిల్లా
ఫోన్ నెంబర్ 9392326772

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE V ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION)::GUNTUR
O.S.No: 363 / 2024

Between:
Canara Bank,Lam farm Branch , Rep.by its Branch Manager. ..... Plaintiff
AND
Sykam Murali ...... Defendant
To,
Sykam Murali, S/o. Khadaraiah, R/o. Door No. 4-23, Lankevani Dibba, Gangadipalem, Repalle Mandal, Guntur District., Presently Bapatla Dist.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:23-07-2025న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:23-07-2025

ఆత్మకూరి ప్రేమసాయి,
వాది తరపు అడ్వకేట్,
6/13B, బ్రాడీపేట, గుంటూరు.,
సెల్:94926 88463

డాక్యుమెంట్ పోయినది

అద్దంకి సత్యవతి భర్త లేటు ముదిగొండ శంకరరావు వయసు 75సం.లు రాజీవ్ నగర్, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా, అనునేను తెలియ జేయునది ఏమనగా నాతాలూకు ఒంగోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెం.2302/2002 ఒంగోలు మంగమూరు డొంక సర్వేనెంబర్250లో 9గదుల 48 అ.లు స్థలము నకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను తీసుకుని నేనుతేది 14.07.2025న మంగమూరు డొంక లోని అచల నంద ఆశ్రమము ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో నాఒరిజినల్ డాక్యుమెంట్ ఎక్కడో పడిపోయినది. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ పోయిన విషయం గమనించి నేను అంతా వెతికి అందరిని విచారించినాను కానీ దొరకలేదు. కాన దొరికిన వారు ఈక్రింది చిరునామాకు గాని ఫోన్‌నెంబర్ గాని తెలియపరచ వలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
అద్దంకి సత్యవతి
భర్త ముదిగొండ శంకర్రావు
ప్లాట్ నెంబర్ 206, రాజేశ్వరి రెసిడెన్సి,
రాజీవ్ నగర్, ఒంగోలు
సెల్ నెం.8686454647

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం:95/2024

బోగెం వెంకట సుబ్బమ్మ అలియాస్ సుబ్బమ్మ..వాది
వర్సెస్
కందే నాగశెట్టి .... ప్రతివాది
టు,
కందే నాగశెట్టి, తండ్రి: సుబ్బరాయుడు,
వడ్డె బజారు, మార్కాపురం టౌన్ ,
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఓ.ఎస్. 95/2024లో కోర్టు వారు ప్రతివాదికి నోటీసులు ఎన్ని పర్యాయములు జారీ చేసిననూ, అందని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఆర్డర్ వేసియున్నారు. కావున మీరు తేదీ: 11-08-2025 న స్వయముగా కానీ, మీ వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్ష మందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 11-08-2025
మార్కాపురం **బి.కాశయ్య,**
అడ్వకేట్, మార్కాపురం
సెల్: 9912726289.

మహారాజశ్రీ
మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
ఐ.ఎ. 704/2024
ఇన్
ఓ.ఎస్. 8/2018

తిరువీధి చిన్న వెంకటేశ్వర్లు ... పిటీషనరు/ప్రతివాది
వర్సెస్
బత్తుల మల్లికార్జునరెడ్డి.......... రెస్పాండెంట్/వాది
టు,
బత్తుల మల్లికార్జునరెడ్డి, తండ్రి: కేశవులరెడ్డి,
హిందూ, వ్యాపారం,
నివాసం: మార్కాపురం టౌన్, మార్కాపురం
మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో పిటీషనర్/ప్రతివాది తనపై పాలించిన ఎక్స్ పార్టీ డిక్రీని రద్దు చేయమని దాఖలు చేసిన పిటీషనులో ఆలస్యమును మన్నించమని దాఖలు చేసుకున్న పై నెంబరు ఐ.ఎ. 704/2024లో రెస్పాండెంట్/వాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినా ముట్టని కారణంగా, నీకు నోటీసు ఈ ప్రకటన ద్వారా జారీ చేయడమైనది. కాబట్టి నీవు 05-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటల కు నీవు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 05-08-2025

ఎం.సుబ్బారెడ్డి,
అడ్వకేట్, మార్కాపురం.

దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. వివిపురంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాన్ని కుందుర్తి చిన్న నర్శింహులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం దొనకొండ ప్రాంతం రాష్ట్ర రాజధానిగా మారుతుందని తద్వారా ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఎంతో ఆశపడ్డారన్నారు. ఏళ్లు గడుస్తున్నా పారిశ్రామిక అభివృద్ధిలో అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. అనేక దేశాల వాళ్లు రావటం, పోవటమే తప్పా ఒక్క పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాలేదన్నారు. వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు తగిన పనులు లేక నిత్యం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు 12, 13 తేదీల్లో కనిగిరిలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటియు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పాల్గొన్నారు అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా చిన్నముసలయ్య, కార్యదర్శిగా కుందుర్తి చిన్న నర్శింహులు, సభ్యులుగా రాయని చెన్నయ్య, ముసుగు నాగమణి, బెల్లం దుర్గలను ఎన్నుకున్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-కొత్తపట్నం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మండలంలో సుడిగాలి పర్యటించారు. శనివారం సాయంత్రం నుంచి మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, గమండ్లపాలెంలో పర్యటించారు. పార్టీ నాయకులు భారీ ర్యాలీతో బ్రహ్మ రథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా పాటించారన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికీ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జంపని రామచంద్రరావు, బలగాని వెంకటేశ్వరరావు, బలగాని బోసు, కొత్తపట్నం పల్లెపాలెం గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బిఎన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీని జేసి గోపాలకృష్ణ, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్‌తో కలిసి పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మధ్య మధ్యలో ప్రతి షాపును సందర్శిస్తూ యజమానులకు ప్లాస్టిక్ వాడుకోవడంతో వచ్చే అనర్థాలు వివరించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి షాప్ యజమాని ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు అమ్మకూడదని నగరపాల సంస్థను ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా నిలిపేందుకు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలకు బదులు బయోడిగ్రేడబుల్ వస్తువుల్ని ఎలా వాడాలో నగరపాల సంస్థ ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సమర్థవంతంగా అందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆర్టీసీ డిపోలో శనివారం నూతన బస్సు సర్వీసును కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను ప్రజలకు సమర్ధవంతంగా అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఆర్టీసీ అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సయానా బేగం, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే:

కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఎస్సీ వసతి గృహాన్ని ఎమ్మెల్యే శనివారం సాయంత్రం పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూ శివా నాయక్, సంక్షేమ అధికారి మురళి, కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు 144 బూత్‌లో శనివారం సాయంత్రం జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని ఈ యాప్‌లో నమోదు చేశారు. కనిగిరి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయిస్తున్న ఏఈ రసూల్

విద్యుత్ స్తంభాన్ని సరిచేసిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

బివికె గ్రీన్ ఫీల్డ్ రోడ్డు జంక్షన్ ప్రాంతంలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని శనివారం సరిచేయించారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు జంక్షన్ ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ఉండటంపై 'ఒరిగిన విద్యుత్ స్తంభం పొంచి ఉన్న ప్రమాదం' అంటూ శనివారం ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు విద్యుత్ శాఖ ఏఈ షేక్ రసూల్ స్పందించారు. ఒరిగిపోయి ఉన్న విద్యుత్ స్తంభాన్ని గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు కాంట్రాక్టర్ చేత సరి చేయించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.

కూటమి పాలనలో ప్రజలే పాలకులు

దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ప్రజాశక్తి-దర్శి

కరపత్రాలు పంచుతున్న గొట్టిపాటి లక్ష్మి

సుపరిపాలన ఏడాది తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మీ ఇంటికి వచ్చాం, మీ అభిప్రాయం తెలుసుకోనేందుకు మీ గడపకి వచ్చాం అంటూ దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం సాయంత్రం దర్శి పట్టణంలోని 4వ వార్డు ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. ఏడాది కూటమి పాలనలో సిఎం నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రజాసంక్షేమ అభివద్ధి కోసం పరితపిస్తున్నారని తెలిపారు. ఏడాది పాలనలో 90 శాతం హామీలను నెరవేర్చి ప్రజల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా మన కూటమి పాలన సాగుతుదన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికీ చేరాలని నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రజల సంతోషం ఆనందం వారిలో ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు వారదులుగా ప్రభుత్వానికి మేము సేవకులుగా ఇంటింటికి తిరుగుతున్నామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, నియోజకవర్గంలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మరెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు పుల్లచెరువు సత్యనారాయణ(చిన్న), దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, కౌన్సిలర్లు ఇత్తడి సునీత–దినకర్, టిడిపి నాయకులు, సంగ తిరుపతిరావు, అనిల్, క్లస్టర్లు, యూనిట్ మరియు బూత్ ఇంచార్జిలు, కెఎస్ఎస్ సభ్యులు, నియోజకవర్గంలోని టిడిపి సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న రామన వెంకటేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి తాలుకా యూనిట్ కార్యవర్గ సమావేశం శనివారం రాత్రి కనిగిరి పట్టణంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు రామన వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యత్వం, సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే బదిలీలపై వెళ్లిన వారి స్థానంలో నూతన కమిటీ సభ్యులుగా కనిగిరి డివిజన్ విఆర్ఓ సంఘం కార్యదర్శి బసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ పిఆర్ క్లాస్–4 సంఘం జిల్లా అధ్యక్షులు డి.శామ్యూల్, ఆర్అండ్‌బి సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి రాయిజ్ బాబా, సచివాలయం శానిటరీ సెక్రటరీ డి.రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌విఆర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో జిల్లా కమిటీ ఆదేశాల మేరకు సంఘం సభ్యత్వంను పెంచి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి తాలుకా యూనిట్ కమిటీ అధ్యక్షులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం కోశాధికారి శ్రీనివాసులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-దర్శి

ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేపట్టే విధంగా ఆ శాఖ సిబ్బందికి సహకరించాలని వ్యవసాయశాఖ జెడిఎ ఎస్.శ్రీనివాసరావు, విఎఎలు, విహెచ్ఎలకు సూచించారు. మండల కేంద్రమైన దర్శి ఎంపిడిఓ సమావేశం హాలులో జరిగిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమానికి జెడిఎ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జెడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఎస్‌కెలలో ఎక్కువమంది ఉద్యోగులు ఉన్నారని, పని తక్కువగా జరుగుతుందని, ఉద్యోగులకు తగినంత పని చేయాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయశాఖ డిపిఎం సుభాషిణి మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం మనం వ్యవసాయంలో భాగమే ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసే విధానంగా ఆర్‌వైఎస్ఎస్ సిఇఓ టి.విజయ్‌కుమార్ వీడియో ద్వారా ప్రకతి వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన, వాటి ఉపయోగాలు, వర్షపు నీరు ఏ విధంగా భూమిపై పడుతుంది అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ కె.బాలాజీనాయక్, ఒంగోలు ఆత్మ ఏడిఏ విజయకుమారి, ఏడిఏ నిర్మల, వ్యవసాయవ అధికారి కె.రాధ, మాస్టర్ ట్రైనర్లు వై.మేరీడేటిల్లా, జె.ప్రభాకర్, విఏఏలు, విహెచ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలపు సురేష్‌ని సన్మానిస్తున్న దృశ్యం

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-టంగుటూరు

కూటమి ప్రభుత్వం పథకాల అమలులో విఫలమైందని కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రమైన జరుగుమల్లిలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అధికారులు పాలకులకు తొత్తులుగా మారారన్నారు. అర్హులైన వృద్ధులకు, వితంతువులకు ఫించన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం పథకం అందిస్తామని చెప్పి చివరకు తల్లులను మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి వైసీపి మండల అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసరావు, కనపర్తి శేషారెడ్డి, జరుగుమల్లి మాజీ కన్వీనరు బత్తిన మదన మనోహరు, జరుగుమల్లి ఉపసర్పంచి దుంపా అనిల్ కుమార్‌రెడ్డి, వైసీపి నాయకులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన

భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా విన్నూత్నంగా నిరసన తెలిపారు. పట్టణ ప్రధాన వీధుల్లో భిక్షాటన చేస్తూ తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శనివారం 7వ రోజుకు చేరింది. సమ్మెకు యూనియన్ నాయకులు మాలాద్రి, రాజశేఖర్ మద్దతు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి గడియారం సెంటర్, కూరగాయల మార్కెట్ వరకు భిక్షాటన చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ వీరస్వామి మాట్లాడుతూ కార్మికుల సమ్మెతో పట్టణంలో పౌర సేవలు నిలిచి పోతున్నప్పటికీ అధికారులు, పాలకులకు కనీసం చీమకుట్టినట్లైన లేదని అన్నారు. సత్వరమే పరిష్కరించక పోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయక పోవడం పట్ల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవలైన విద్యుత్తు, నీటి సరఫరా నిలిచిపోక ముందే ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు కట్టా వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షులు సింగయ్య, ఇమ్మానియేలు, విశ్వేశ్వరరావు, కిషోర్, సంగీతరావు, మురళి, గూడూరి కోటేశ్వరి, జి ఆదిలక్ష్మీ, సంధ్య, బడుగు కుమారి, సునీత, స్వరూప, నూతలపాటి మరియమ్మ, రాజేశ్వరి, అయ్యప్ప, కాంతారావు, చాంద్ బాషా, కాంతారావు పాల్గొన్నారు.

బాపట్ల : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కారం అయ్యేవరకు పోరుబాట పడతామని కుల వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. సమ్మెకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, ఎస్ఎఫ్ఐ మాజీ ఉపాధ్యక్షులు మనోజ్‌తో కలిసి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శరత్, నాయకులు నాని, రత్నం, హరిబాబు, అంకారావు, ఏసమ్మ, ప్రమీల, సామిరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికుల సమ్మెకు ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కావూరి రఘుచంద్, పారిశుద్ధ్య కార్మికులు మద్దతు తెలిపారు. కార్మికుల సమ్మె శనివారంకు 7వ రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపాల్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డు నందు కార్మికులు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కె రఘు చంద్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి కుటుంబాల పైన ఆర్థిక భారం పడుతుందని, విద్యా, వైద్యానికి కార్మికులు అప్పులు చేసి ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. కార్మికులకు నెలకు రూ.15 వేల వేతనంతో కుటుంబ ఖర్చులు ఎలా భరించగలరో అర్థం చేసుకోవాలని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జిఒ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా కార్మికుల పేర్లు తొలగించాలని అన్నారు. పిఆర్సి అమలు చేయాలని అన్నారు. సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ నాయకులు డి గంగాధర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం, అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాలి భీష్మ, ఇంజనీర్ విభాగం నాయకులు వి జాన్, ఉసిరిపాటి శామ్యూల్, కె మారుతి, జి మార్కు, అలివేలమ్మ, జ్యోతి, వెంకటరావు పాల్గొన్నారు.

రేపల్లె : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు 7వ రోజు సమ్మెలో భాగంగా ఒంటి కాలుమీద నిలబడి శనివారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద యూనియన్ కోశాధికారి కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ గతేడాది 17 రోజుల సమ్మె ఒప్పందాలు అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. జిఒ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి ప్రభాకరరావు, కార్యదర్శి ఎన్ రవిబాబు, రవి, శ్రీను, వాసు, సుధాకర్, ఎఐటియుసి యూనియన్ నాయకులు బి ముఖర్జీ పాల్గొన్నారు.

అద్దంకిలో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

రేపల్లెలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

బర్లీ పొగాకు రైతులు ఓపిక పట్టాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - పర్చూరు

బర్లీ పొగాకు రైతులు కొద్దిగా ఓపిక పట్టాలని, రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. స్థానిక ఎఎంసి ఆవరణ, ప్రభుత్వ వేర్‌హౌస్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును ప్రైవేట్ కంపెనీలు ఏమైనా వచ్చి గ్రామాల్లో కొంటున్నాయాని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలుకు ప్రైవేట్ కంపెనీలు రాలేదని రైతులు తెలిపారు. ఈ ఏడాది పొగాకు సాగు చేస్తారా అని అడిగారు. ఉన్న పొగాకు విక్రయించుకుంటే చాలని, పొగాకు పంట వేసేది లేదని రైతులు అన్నారు. కొంతమంది రైతులు పొగాకు చెక్కల కొనుగోలులో సీరియలు పాటించడం లేదని, పైరవీ చేసి కొంత మంది ముందుగా విక్రయించుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలో 13వేల మంది రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేసినట్లు చెప్పారు. వచ్చే సోమవారం నుండి 1500 మంది రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేసేటట్లు ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు. ఆగస్టులో కూడా బర్లీ పొగాకును కొనుగోలు జరిగేటట్లు చూస్తామని చెప్పారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకు గోదాముల్లో నిల్వలు ఎక్కువ ఉన్నాయని, వీటిని వేరే గోదాముల్లోకి తరలించిన తర్వాత పొగాకు కొనుగోలు వేగంగా చేస్తామని చెప్పారు. మంచి పొగాకు కూడా బయ్యరు రేటు వేయడం లేదని రైతులు వివరించారు. మొదటి గ్రేడ్ పొగాకులో తేమ శాతం ఎక్కువగా ఉందని, ఇతర బేళ్లల్లో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉందని ఆ బేళ్లను పక్కన పెట్టారని బయ్యర్ తెలిపాడని చెప్పారు. ఆ పొగాకు బేళ్లను బయట ఆరబెట్టిన అనంతరం తిరిగి కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని అన్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు సూచించిన నాణ్యత ప్రమాణాలతో పొగాకు బేళ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. మెసేజ్‌లు రాలేదనే ఇబ్బందిని తొలగిస్తామని, రెండు రోజుల ముందే రైతుకు సమాచారం అందిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 900 టన్నుల పొగాకు రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు చెప్పారు. పొగాకు కొనుగోలు మూడు నెలలైనా కొంటామని చెప్పారు. ఐదు రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, రైతులు తమ పొగాకును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. పొగాకు రైతులకు, బయ్యర్లకు మాత్రమే ఎక్కువ అవగాహన ఉందని, తాము కేవలం అధికారులు మాత్రమేనని చెప్పారు. రైతులు మోసపూరితంగా వ్యవహరించ కుండా నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న పొగాకు లేదా, పొగాకు బేళ్లల్లో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న పొగాకు కొనుగోలు చేస్తే ఎక్కువ రోజులు నిల్వ ఉండదని బయ్యరు సూచించాడు. ఏ బయ్యరు రైతులను ఇబ్బంది పెట్టే విధంగా చేయరని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు, ఎఒ భాస్కరరావు, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

పర్చూరులో పొగాకు పరిశీలిస్తున్న కలెక్టర్ జెవి మురళి

కౌలురైతు మహాసభల వేదిక

నేడు కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - కారంచేడు

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో జరగనుంది. ఈ మహా సభకు సంఘ రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని, జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పి కొండయ్య కోరారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి సారి జరుగుతున్న మహా సభకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి కౌలు రైతులు హాజరు కానున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషిని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలు నిర్దేశించనున్నట్లు తెలిపారు. గతేడాది కొమ్మమూరు కాలువకు నీరు రాక పైర్లు ఎండిపోతున్న స్థితిలో కారంచేడు, ఇతర ప్రాంతాల్లో సాగునీటి కోసం ఆందోళనలు నిర్వహించి వారబందిని సక్రమంగా అమలు జరిపి చివరి భూములకు నీరు వచ్చే విధంగా సంఘం కృషి చేసిందని తెలిపారు. నల్లబర్లీ పొగాకు సమస్యపై రైతు సంఘంతో కలిసి కౌలు రైతు సంఘం సుదీర్ఘ పోరాటం చేసిన తర్వాతే ప్రభుత్వం ముందుకు వచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం ప్రారంభించిన సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ క్రాప్ చేయించడం ద్వారా పంట వేసిన కౌలు రైతులు నష్టపరి హారం వచ్చేలాగా జిఒను సాధించినట్లు తెలిపారు. బహిరంగ సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, ఏడుకొండలు పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న శిద్ది బుచ్చేశ్వరరావు

చేనేత దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

ఆగస్టు 7న జరుగనున్న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. మండలంలోని జంధ్రపేటలో టిడిపి నాయకులు శిద్ది బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేతలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. కలెక్టర్ వెంకట మురళిని కలిసి చేనేత కుప్పడం చీరలకు మార్కెటింగ్ సదుపాయాలపై చర్చించామని అన్నారు. అందుకు సంబంధించిన ప్రణాళిక త్వరలో తుది రూపుదిద్దుతామని అన్నారు. చేనేతకు గౌరవం కల్పిస్తూ స్థానికంగా చీరల ప్రదర్శన, అవగాహన సదస్సులు, జాతీయ జెండా తయారీ ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని కోడితాడిపర్రు, వామనగుంటపాలెం, గోపాయపాలెం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమాన్ని ఇంటింటికీ తిరిగి కరపత్రాల రూపంలో వివరించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, నియోజకవర్గ పరిశీలకులు వంగాసా మిరెడ్డి, అమృతలూరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షేక్ ఖాజావలిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన ఖాజావలి

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఇటీవల జరిగిన నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జూనియర్ మెన్ బెస్ట్ లిఫ్టర్ ఇన్ ఇండియా సెకండ్ రన్నర్ అప్ పొందినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల కర్ణాటకలోని దేవనగర ఎకెఎస్ కన్వెన్షన్ హాలులో జరిగిన నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎంబిఎ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి షేక్ ఖాజావలి జూనియర్ మెన్ బెస్ట్ లిఫ్టర్ ఇన్ ఇండియా సెకండ్ రన్నర్ అప్ అవార్డు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. విద్యార్థులను చదువులతోపాటు క్రీడలపట్ల ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డులు పొంది మంచి పేరు తీసుకురావాలని కోరారు. అవార్డు సాధించిన క్రీడాకారుణ్ణి పిడి అన్నం శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్ఒడి ఆర్ ఇమ్మానుయేల్, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

ట్రంక్ రోడ్డు విస్తరణను 60 అడుగులకు కుదించాలి

- నష్టపోయిన వ్యాపారులకు పరిహారం చెల్లించాలి

- ది ట్రంకురోడ్డు షాపు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలుకలెక్టరేట్

ఒంగోలు నగరంలో ట్రంక్ రోడ్డు విస్తరణ 60 అడుగులకు కుదించాలని ది ట్రంక్ రోడ్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి సత్యనారాయణ, కార్యదర్శి దేవతు వినోద్ కుమార్ మాట్లాడారు. ట్రంకు రోడ్డులో గత 50 స సంవత్సరాలుగా వన్‌వే ట్రాఫిక్ అమలు జరుగుతుందన్నారు. వాకర్స్ వీధిగా ప్రజలకు ఉపయోగంలో ఉందన్నారు. ప్రస్తుతం ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు ఈ రోడ్డును 48 అడుగుల నుంచి 100 అడుగుల విస్తరణకు ప్రతిపాదించారన్నారు. ట్రంకు రోడ్డు ఇరువైపుల సుమారు 254 మంది చిన్న వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తూ వాటిపై ఆధారపడి ఉన్నారన్నారు. మున్సిపల్ అధికారుల నివేదిక ప్రకారమే రోడ్డు విస్తరణతో 140 దుకాణాలు పూర్తిగా కనుమరుగై, మరో 20 దుకాణాలు 5 లేక 10 అడుగులతో మొండి గోడలతో ఉంటాయన్నారు. మిగిలిన దుకాణాలు పాక్షికంగా దెబ్బతింటాయన్నారు. ఈ దుకాణాలపై యజమానులు, కార్మికులు, వారి కుటుంబాలు కలిపి సుమారుగా 5 వేల మంది ఆధారపడిఉన్నట్లు తెలిపారు. రహదారి విస్తరణతో వారంతా నిరాశ్రయులు. నిరుద్యోగులుగా మారుతారని తెలిపారు. ఈ విస్తరణ విస్తరణను తాముపూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నెల్లూరు గుంటూరు, విజయవాడ వంటి పెద్ద నగరాలలో కూడా పాత వీధులు వన్‌వే ట్రాఫిక్ లో నడుస్తున్నాయన్నారు. ఒంగోలులోని ట్రంకురోడ్డుని కూడా యధావిధిగా ప్రస్తుతం ఉన్న విధంగా కొనసాగించాలని వారు కోరారు. 2003లో నాటి టిడిపి మున్సిపల్ చైర్మన్ యక్కల తులసీరావు సారధ్యంలో 26 అడుగుల ట్రంకురోడ్డును 48 అడుగులకు విస్తరించారన్నారు. టిడిపి పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రముఖులు ఇక పై ఎలాంటి విస్తరణ జరగదని హామీ ఇచ్చారన్నారు. దీంతో తాము. నష్టపరిహారం కోరకుండా స్వచ్ఛందంగా విలువైన వ్యాపార స్థలములను మున్సిపాలిటి వారికి అప్పగించామన్నారు. తరువాత సొంత ఖర్చులతో షాపులకు రిపేర్లు చేయించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిపాదిత ట్రంకు రోడ్డు విస్తరణను 60 అడుగుల వరకు కుదించాలనరాద్ర. విస్తరణలో పూర్తిగా వ్యాపార స్థలం కోల్పోయిన వారికి రెట్టింపు స్థలం కేటాయించి షాపులు కట్టించి ఇవ్వాలన్నారు. ఆ యజమానుల పేర్లను కార్పోరేషన్ రికార్డులలో నమోదు చేయించాలన్నారు. షాపుల కట్టించిన తరువాత మాత్రమే రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు పాక్షికంగా స్థలం కోల్పోయిన వారికి 2013 ఎల్ఎఆర్ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పించి పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ది ట్రంక్ రోడ్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

మేయర్ సుజాతను పరామర్శిస్తున్న ఎంపీ మాగుంట

మేయర్‌కు మాగుంట పరామర్శ

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మేయర్ గంగాడ సుజాతను ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఆమె కాలికి, చేతికి గాయాలయ్యాయి. అందులో భాగంగా ఎంపీ మాగుంట మేయర్ గంగాడ సుజాతను ఆమె స్వగృహంలో కలసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్ బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, ఎఎంసి మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం తదితరులు పాల్గొన్నారు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా లోని ప్రభుత్వ మరియు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో గత విద్యా సంవత్సరంలో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వర్తించిన అధ్యాపకుల నుండి 2025-26 విద్యా సంవత్సరానికి సర్వీసులను పునరుద్ధరించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 693 ఒప్పంద అధ్యాపకులకు ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ 30 వరకూ విధుల్లో కొనసాగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

డిగ్రీ కాలేజీలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనారోగ్యంతో పాటు కేన్సర్ బారినపడే అవకాశం ఉందన్నారు. అందువలన ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్-ఎస్ఎస్ఎ కోఆర్డినేటర్ జయసింహ, అధ్యాపకులు శ్రీనివాస చార్యులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రైవేట్ పెత్తనం సహించం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రైవేట్ పెత్తనాన్ని సహించేది లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేట్ భాగస్వామ్యం అవలంబించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎక్కడా ఇలాంటి విధానం అమలు కాలేదన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో నిర్మిస్తామని చెప్పడాన్ని సిపిఐ ఖండిస్తుందన్నారు. గత వైసిపి హయాంలో పోలవరం ఎత్తును తగ్గించాలని కేంద్రం సూచించినట్లు తెలిపారు. ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కార్ అదే రాజకీయం చేస్తుందని విమర్శించారు. పోలవరానికి 45.75 అడుగుల ఎత్తు సాధ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. 41.5 అడుగుల మేర నిలిపితే తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.. వెలిగొండ, హంద్రీనీవా, గాలేరు-నగరి, వంశధార, నాగావళి తదితర ప్రాజెక్టులు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఏడాది పాలనలో రూ.లక్ష 70 వేల కోట్లు అప్పు చేసినా అభివృద్ధి లేదన్నారు. అమరావతికి రూ.31 వేల కోట్లు అప్పు చేసి వడ్డీకి సంవత్సరానికి రూ.70 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. కరేడు వద్ద 8,500 ఎకరాలను ఇండోసోల్ కు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, పంటల భూములు కాకుండా తీరప్రాంతంలోని ఎడారి భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతిపై పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. పవన్ బీజేపీ-ఆర్ఎస్ఎస్ భజన చేస్తూ గుడుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ విమర్శలు వ్యక్తిగతంగా కాకుండా వ్యవస్థపరంగా ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న అభ్యంతరకర వ్యాఖ్యలను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వచ్చేనెలా 23, 24,25తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్న సిపిఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ, ఆర్.వెంకట్రావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, యుగంధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మూడునెలల్లో పనులు పూర్తి చేయండి

ఒడా వైస్ చైర్మన్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలుకలెక్టరేట్

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని మురుగునీటి కాలువల నిర్మాణ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్, ఒడా వైస్ చైర్మన్ ఆర్.గోపాల్ కృష్ణ అధికారుల ఆదేశించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధి లోని ఒంగోలు నగర పాలక సంస్థ, మార్కాపురం, అద్దంకి, చీరాల, కనిగిరి మున్సిపాలిటీలు, చీమకుర్తి, దర్శి, పొదిలి, గిద్దలూరు నగర పంచాయతీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా సేకరించబడిన నిధుల ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణం గా 96 పనులకు రూ.13.35 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఆమోదం మంజూరు చేశారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు ప్రధానంగా మురుగు కాలువలు నిర్మాణం, వరద కాలువల నిర్మాణం కోసం ప్రతి పాదించామన్నారు.ఆ పనులకు మున్సిపాలిటీల ద్వారా టెండర్లు పిలిచి మూడు నెలల లో పూర్తి చేయాలని లక్ష్యం గా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డియు. తరుణ భాస్కర్, ప్రణాళిక విభాగం అధికారి కె. బాబూరావు ,ఇంజనీరింగ్ విభాగం అధికారి టి. శ్రీనివాస సంజయ్, సెక్రటరీ ఆర్. చండీ దేవసేన, పరిపాలన అధికారి కెవి. పద్మావతి, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ. అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఒడా వైస్‌చైర్మన్ గోపాల కృష్ణ

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్టఅని మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో బాబుష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమాన్నిఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయకుడు ప్రతి ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. వెన్నుపోటు, నయవంచన, మోసాలు చంద్రబాబు సొంతమన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయాలంటే భయమేస్తుందని చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. సంక్షేమ పథకాలు వైసిపి వారికి ఇవ్వొద్దనడానికి రాష్ట్ర బడ్జెట్ చంద్రబాబు సొత్తా అని మండి పడ్డారు. ప్రజలు కట్టిన ట్యాక్స్‌లతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, పింఛన్లు, కార్పొరేట్ విద్య లాంటి పథకాల అమలు జగన్ పాలనలోనే సాధ్యమైందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఇవిఎంలు గోల్‌మాల్ చేసి గెలిచి ప్రజలను మోసం చేశారన్నారు. దౌర్జన్యాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు జగన్‌పై ఉన్న ఆదరణ తట్టుకోలేక వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టిస్తున్నట్లు తెలిపారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్ని అమలు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, అధికార ప్రతినిధులు ఆరె శ్యామల, నాగార్జున యాదవ్, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, వైసిపి మండల కన్వీనర్లు, వైసిపి అనుబంధ విభాగాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు

పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఇఒ నిరంజన్

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

అందరికి చదువు, అందరి బాధ్యత అనే లక్ష్యంతో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఎంఇఒ ఎస్ నిరంజన్ అన్నారు. మండలంలోని చెరువు జమ్ములపాలెం క్రైస్తవ స్వచ్ఛంద సేవ సంస్థ సహకారంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను ఎంఈఓ పంపిణీ చేశారు. జెవిఎస్ ఎంఎం సర్వీసు సొసైటీ అధ్యక్షులు కన్నెగంటి జాన్ వెస్లీ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత పుస్తకాల పంపిణీలో 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జి సుజాత, ఉపాధ్యాయులు ఎం ప్రకాశవర్ధిని, జె శ్యామసుందరి, వి భారతి, బుర్రా మోజెస్, జయపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కారంచేడు

బైకుపై వెళ్తూ ప్రమాదానికి గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అర్థరాత్రి జరిగింది. ఎస్ఐ ఖాదర్ భాష తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిమ్మిడితపాడుకు చెందిన పాటిబండ్ల కృష్ణ (35) శుక్రవారం అర్థరాత్రి తన కుటుంబ సభ్యులను రైలు ఎక్కించేందుకు చీరాల వచ్చి అనంతరం ఒంటరిగా బైకుపై తిరుగు ప్రయాణమయ్యాడని, ఈ ప్రయాణంలో చీరాల నుంచి స్వర్ణ మీదుగా ప్రయాణం చేసే నేపథ్యంలో స్వర్ణ దగ్గరలోని దీపావళి టపాసులు అమ్మే గోడౌనుకు సమీపంలో కృష్ణ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడని తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణాలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. వైకు అదుపు తప్పి పడ్డారా, లేక ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి ప్రమాదం జరిగిందా? అనేది విచారణలో తేలాల్సి ఉంది.

ఎపిఎం జ్యోతి ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి : ఎపిఎం

ప్రజాశక్తి - పంగులూరు

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి, కుటుంబ పోషణలు వారే పెంచుకునేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎపిఎం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మాధవి అధ్యక్షతన మండల సమైక్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అనేక రకాలుగా రుణ సౌకర్యాలు కల్పిస్తున్నామని, రుణాలు తీసుకున్న మహిళలు తమ జీవనోపాధులు పెంచుకోవాలని చెప్పారు. మండలంలో స్త్రీ నిధి రికవరీలు తక్షణమే చేపట్టాలని అన్నారు. కొత్త రుణాల పంపిణీ అవకాశం ఉన్నంత వరకు ఇవ్వాలని అన్నారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తే మరింత రుణం పొందవచ్చని అన్నారు. అనంతరం ఎపిఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన జ్యోతి ప్రసాద్ బాబును ఘనంగా సన్మానించారు. స్త్రీ నిధి మేనేజర్లు, సీసీలు చాట్ల సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, వివఎలతోపాటు వెలుగుదేశం మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, ఓబులురెడ్డి, గుర్రం ఆదిశేకర్, గుదిబండ్ల ఆదిరెడ్డి, ఉన్నం రవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరులో మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ

ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిషేధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ చెప్పారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణకి కలిగే అనర్థాలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. చెరుకూరు ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. జడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్ పాలేరు కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి దాసరి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, వితఒ వై శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనలో భాగంగా ఉప్పుటూరి ప్రభుత్వ హెూమియో వైద్యాధికారి డాక్టర్ దాసరిక్ చంద్రశేఖర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రకుల తిరుమలేశ్వరరావు, పాలేరు ఆంజనేయులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అద్దంకి : ప్లాస్టిక్ రహిత పర్యావరణ హిత సమాజమే లక్ష్యంగా యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కట్టా రామ కోటేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది కళాశాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి సంబంధిత యాజమాన్య కట్టడాలకు చేరవేశారు. మున్సిపల్ కమిషనర్ ఈ రవీంద్ర మాట్లాడారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మస్తాన్ వలి, డాక్టర్ వి ప్రసాద్, సిహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కర్లపాలెం : స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ ఒక అడుగు వేయాలని ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. 3వ శనివారం పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై ఉన్నత పాఠశాల నుండి విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు షాకీర్ పాషా మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం మానవాళికి ముప్పు అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, ఈఓపిఆర్డి శ్రీనివాసరావు, ఐనంపూడి హెచ్ఎం విజయశ్రీ, జి శ్రీనివాసరావు, ఇనకొల్లు పోలీసురావు, ఫ్రాన్సిస్, సంతోష్, జ్యోతి పాల్గొన్నారు.

కారంచేడు : స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక చిన్న వంతెన సెంటర్లో అధికారులు, విద్యార్థులు శనివారం ర్యాలి నిర్వహించారు. ర్యాలీలో ఎంపిడిఒ కె నేతాజీ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ సాధనకు అందరూ కలిసి రావాలని అన్నారు.

వేటపాలెం : స్వచ్ఛతకై ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని ఆమోదగిరిపట్నం ఆదర్శ పాఠశాల హెచ్ఎం శేఖరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి సరోజిని, పంచాయతీ కార్యదర్శి బాలిగ సురేంద్ర, బి శివ పసాద్, పిడిలు జె దేవభిక్షం, శ్రావణి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం నిషేధించాలని ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో తహశీల్దారు మేకా శ్రీనివాసరావు, సుశీలతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గుడిమెట్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

అభినందిస్తున్న ఎస్ఐ హరిబాబు, ప్రిన్సిపల్ నిరుపమ

విద్యార్థి నాయకత్వం గౌరవానికి మాత్రమే కాక బాధ్యతకు సూచికగా నిలవాలని, నాయకత్వం పొందిన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎస్ఐ హరిబాబు అన్నారు. కొత్తపేటలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవా దృక్పథం కలిగి ఉంటేనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు స్నేహపూరిత వాతావరణంలో చదువుకోవాలని, చెడు వ్యసనాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. హెడ్ బాయ్‌గా జస్వంత్, హెడ్ గర్ల్‌గా జాస్మిత్ ఎంపికయ్యారు. డిప్యూటీ హెడ్ బాయ్‌గా మనీష్ కుమార్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా దీప్తి బాధ్యతలు చేపట్టారు. విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు కట్టించి ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిరూపమ మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలు విద్యతోపాటు క్రమశిక్షణపై ప్రాధాన్యం ఇస్తున్నాయని అన్నారు. ప్రతి ఏటాలాగే ఈసారి కూడా 4 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల మధ్య కేబినెట్ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటు హక్కు, ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని చెప్పారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతల పట్ల స్పష్టత పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఎజిఎం పెద్దిరెడ్డి, సిపిఐ శ్రీనివాస్, ఆర్ఎస్ జీవన్ బాబు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పర్చూరు

మాట్లాడుతున్న సిహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య

స్థానిక ప్రభుత్వ క్లస్టర్ హెల్త్ సెంటర్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు సిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య తెలిపారు. శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. దగ్గు, జలుబు, జ్వరాల కేసులతో పాటు కార్డియాక్ కేసుల వరకు చూస్తున్నట్లు చెప్పారు. ఓపి, ఇన్ పేషెంట్ కేసులు గత ఐదేళ్ల నుంచి పెరిగాయని చెప్పారు. సర్జరీలు చేస్తున్నామని, డెలివరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, అనస్థీషియా వైద్యులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కుక్క, పాము, తేలు కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రక్త పరీక్షలు, సిబిపి టెస్ట్, రాపిడ్ టెస్ట్ ల్యాబ్ అందుబాటులో ఉందని తెలిపారు. త్వరలో ఎక్రే యూనిట్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలలకు ఏమాత్రం తగ్గకుండా వచ్చిన రోగులకు మంచి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ హాస్పిటల్ ఫార్మసీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ఆందోళన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాల్లోని చిన్న షాపులు, టీ స్టాళ్లలో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు అధిక బిల్లులతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.300 ఉన్న బిల్లు స్మార్ట్ మీటర్ బిగించాక ఏకంగా రూ.800 వరకు వస్తుందని చిన్న, చితక షాపుల వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా విద్యుత్ మీటర్లు వినియోగదారునికి తెలియకుండానే తమ షాపుల్లో బిగిస్తున్నారు. ఎవరైనా అడిగితే పాత మీటర్లు స్థానంలో కొత్తవి బిగిస్తున్నామని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారని అంటున్నారు. రహదారుల పక్కన చిన్నపాటి రేకుల షెడ్డు వేసుకొని టీ ప్లాస్క్ కనిపిస్తే ఆ దుకాణదారునికి స్మార్ట్ మీటర్ బిగిస్తున్నారు. బిల్లు అధికంగా వస్తేనే అది స్మార్ట్ మీటర్ అని నిరక్షరాస్యులకు తెలుస్తుంది. ప్రస్తుతం పరిశ్రమలు, హెూటళ్లు, టీ దుకాణాలకు మాత్రమే స్మార్ట్ మీటర్లు బిగించామని విద్యుత్ ఎఇ దీపక్ రెడ్డి తెలిపారు. మండలంలో సింగిల్ ఫేస్‌లో స్మార్ట్ మీటర్లు ఐదు కిలో వాట్స్ తక్కువలో 1102 సర్వీసులు, త్రీ ఫేస్‌లో ఐదు కిలో వాట్స్ కు పైన 62 సర్వీసులు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల సర్వీసులు 15,273 ఉన్నాయని, రానున్న రోజుల్లో గృహలకు 200 యూనిట్స్ పైగా వినియోగించిన వారికి స్మార్ట్ మీటర్లు బిగిస్తామని అధికారులు తెలుపుతున్నారు. అధిక బిల్లుల వసూలు చేసే స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మాట్లాడుతున్న జడ్జి వాణి

బాలికల రక్షణకు ప్రత్యేక కోర్టులు

ప్రజాశక్తి - బాపట్ల

లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నుండి బాలికలను రక్షించడానికి, ఆ విధమైన నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి వాణి అన్నారు. సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాల్లో విద్యార్థినిలకు పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల గృహ హింస, భరణం, విద్యాహక్కు చట్టం, ర్యాగింగ్ వంటి చట్టాల పట్ల విద్యార్థి దశ నుండే బాలికలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సదస్సులో న్యాయవాదులు భీమా లీలా కృష్ణ, కంచర్ల రవిబాబు, రామాంజ నేయులు, బి నాగమణి, సేవాధికార సంస్థ చైర్మన్ కె శ్యాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధికారి పురుషోత్తమరావు

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - కర్లపాలెం

బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పరిరక్షణ అధికారి పురుషోత్తమరావు అన్నారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ (సిఫార్డ్) ఆధ్వర్యంలో మండలంలోని దమ్మనవారిపాలెం సతీష్, అవర్ల మెరైన్ కంపెనీల్లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు నిరోధించాలని అన్నారు. సిఫార్డ్ సంస్థ ప్రతినిధి బడుగు కిషోర్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా రూపొందించుటలో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సతీష్ మెరైన్ హెచ్ఆర్ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ అవుట్ రీచ్ వర్కర్ సయ్యద్ అబ్దుల్ కరీం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఎస్ఐ జివి చౌదరి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్టేషన్ ఆవరణ అంతా బాగు చేశారు. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వన్ టైం యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు.

ప్రజాశక్తి 7
ఆదివారం 20 జులై 2025

మాట్లాడుతున్న చైర్మన్ మించాల సాంబశివరావు

అలసత్వం వహిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - చీరాల

పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులపట్ల అలసత్వం ఉండకూడదని అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో పారిశుద్ధ్య పరిస్థితి శనివారం పరిశీలించేందుకు అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ, చెత్త తొలగించాలని అన్నారు. ఇకపై ప్రతి వార్డులో ఉదయాన్నే పర్యటించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, గోలి రవి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి పి పుల్లారెడ్డి తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో జిల్లా స్థాయి విద్యుత్ అధికారులు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాలు, పల్లెల్లో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో స్మార్ట్ మీటర్లపై అపోహలు తొలగించాలని చెప్పారు. పిఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లోకి మరింత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ ఎ మురళీకృష్ణ యాదవ్, ఫైనాన్సు డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, పిడి మూర్తి, బాపట్ల ఎస్‌ఈ జి ఆంజనేయులు పాల్గొన్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సమాజంలో ఆరోగ్య విస్తరణను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ కృషి చేస్తుందని డాక్టర్ పద్మజ తెలిపారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో సమగ్ర ఆరోగ్య ప్రచారాన్ని జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి (దిశ), హెల్ప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 104 సిబ్బంది సహకారంతో హెచ్ఐవి,సెఫిలిస్, హెపటైటిస్ బి, సి పరీక్షలు నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ వసంత, హెల్ప్ టిఎస్జిఓ సిబ్బంది కంద్రాతి దుర్గ, రాజేష్, శివకుమారి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష

ప్రజాశక్తి - వేమూరు

ఓటర్ల చేర్పులు, మార్పులపై రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు నాగిరెడ్డి మాట్లాడుతూ నూతన ఓట్లు మార్పులు చేర్పులపై రాజకీయ పార్టీలు నాయకులు చర్యలు చేపట్టాలని సూచించారు. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు తహశీల్దార్లు మేక శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుశీల, నెహ్రూబాబు, నాగరాజారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కమ్మిల నాంచారమ్మ

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కమ్మిల నాంచారమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధికారులు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం అంశాలపై చర్చించారు. సర్పంచులు తన గ్రామంలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపిపి మొరాల రాంబాబు, జెడ్పిటిసి చొప్పర సుబ్బారావు, ఎంపిడిఒ నరసింహారావు పాల్గొన్నారు.

పొగాకు రైతులు నాణ్యతా, ప్రమాణాలు పాటించాలి

బర్లీ పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న ఎఒ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లీ పొగాకు గ్రేడింగ్ విషయంలో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎఒ డి సుబ్బారెడ్డి కోరారు. ఓ రైతు ఇంటిదగ్గర పొగాకు గ్రేడింగ్ చేస్తున్న విధానాన్ని ఆయన శనివారం పరిశీలించారు. రైతులు నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లేముందే నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. 20 శాతానికి తేమ కిమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పొగాకు చెక్కులపై వాడే పట్టల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. చిరిగిపోయిన పట్టలు ఉపయోగించకూడదని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం వలన ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పొగాకు అమ్ముకునే అవకాశం ఉందని చెప్పారు. రైతులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి కొనుగోలు కేంద్ర అధికారులు సహకరించాలని కోరారు. రైతు సేవా కేంద్రం విఎఎ శ్రావణి పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని జాగర్లమూడిలో నల్లబర్లీ పొగాకును ఎఒ శనివారం పరిశీలించారు. 20 శాతం కంటే తక్కువగా తేమ ఉండాలని, 50నుండి 150 కేజీ లోపు చెక్కులు ఉండేవిధంగా చూసుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. మండలంలో 1940 మంది రైతులు నల్లబర్లి సాగు చేశారని, యద్దనపూడిలో 240 మంది సాగు చేశారని చెప్పారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. పొగాకు మొత్తం కొనుగోలు చేస్తారని చెప్పారు. మధుప్రియ, విఎఎలు కోటి, ఏసు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న యద్దనపూడి ఎఒ

రైతుల సమస్యలు పట్టించుకోని 'సుపరిపాలన'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రైతుల కష్టాలను పట్టించుకుని తీర్చలేని కూటమి ప్రభుత్వం సుపరిపాలన జరుపుకోవడం విడ్డూరంగా ఉందని వైసిపి ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు అన్నారు. వైసిపి బృందంతో కలిసి కనగాల అప్పోయెంట్ మురుగు కాలువను ఆయన శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గతేడాది రైతులు వరి నాట్లు పూర్తి చేసుకున్న అనంతరం కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు మునిగి, మురుగు నీరు బయటకు వెళ్లే ప్రధాన మురుగు కాలువ గుర్రపుడెక్కతో నిండిపోవడంతో నెలలు తరబడి నీరు పొలాల్లో నిలబడి, బయటకు వెళ్లే మార్గం లేక పంట పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. భట్టిప్రోలులోని చావలి రోడ్డులో ప్రారంభమైన ఈ అప్పుయేంట్ మురుగు కాలువ కనగాల మీదుగా గూడవల్లి, గంగోలులో కలుస్తుంది అన్నారు. రైతులు పంట పొలాలకు అత్యంత ప్రధానమైన మురుగు కాలువ పట్ల ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ కాలువను పట్టించుకోకపోవడం రైతుల పట్ల వారికున్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుందని అన్నారు. మరో 10 రోజుల్లో వరి నాట్లు ప్రారంభించాల్సి ఉండగా ఆగస్టు 10వరకు సాగునీటిని ఈ ప్రాంతానికి విడుదల చేసే పరిస్థితి లేదంటే కూటమి పాలన ఏ విధంగా ఉందో ఒకసారి పరిశీలించుకోవాలని అన్నారు. అభివృద్ధి పేరుతో పూడికతీత చేపట్టి రూ.లక్షలు దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి సిరాజుద్దీన్, వైసిపి మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, కొతరవు శ్రీనివాసరావు, జంగం వాసు, బుల్లెద్దు ప్రతాప్, వేల్పూరు నాగేశ్వరరావు, కుందేటి రమేష్, పసుపులేటి శివరాం ప్రసాద్, మద్దుల గిరి పాల్గొన్నారు.

మురుగు కాల్వలో దిగి నిరసన తెలుపుతున్న అశోక్ బాబు

పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని అడవి పాలెం సచివాలయంలో పీ-4 సర్వేపై గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలతో శనివారం గ్రామ సభ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పేదలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యం అన్నారు. అనంతరం గ్రామంలోని ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి దిండు హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్ పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా 'మోదుగుల'

ప్రజాశక్తి - బాపట్ల

ఎం బసవపున్నారెడ్డి

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా బాపట్లకు చెందిన మోదుగుల బసవ పున్నారెడ్డిని నియమిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర కార్యాలయం నుండి ప్రకటించారు. వైసిపి ఆవిర్భావం నుండి ఆయన పార్టీ కోసం కృషి చేశారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. ఆయన నియామకం పట్ల వైసిపి వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని రహదారి మార్జిన్లలో ఉన్న ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టినట్లు కమిషనర్ కర్ర సాంబశివరావు తెలిపారు. నెహ్రు బొమ్మ సెంటర్లో శనివారం నిర్వహించిన ఆక్రమణల తొలగింపును ఆయన పర్యవేక్షించారు. రహదారి మార్జిన్లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడం వల్ల రహదారులు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య అధికం అవుతుందని అన్నారు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దటంలో భాగంగా ఆక్రమణలు తొలగిస్తున్నామని అన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించుకుని సహకరించాలని అన్నారు.

సీతాపతి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - నగరం

హైదరాబాదులో 'భారత సేవా రత్న నేషనల్ అవార్డ్' గౌరవ డాక్టరేట్ సాధించిన యల్లాప్రగడ సీతాపతికి అభినందన సభ స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించారు. సభకు జంజనం హేమశంకరరావు అధ్యక్షత వహించారు. మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, ఇంకొల్లు వీరబాబు, పివి చింతరావు, చింతల ప్రసాద్, జుజ్జవరపు సురేష్, కొలగాని సునీత, పడమట వెంకటేశ్వరరావు, వుర సుబ్బారావు, జొన్న సాంబయ్య, మట్ట శ్రీనివాసరావు, సాయి, చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బాపట్ల

డాక్టర్ సిద్ధార్థ

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ సూచించారు. జ్వరం, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించి అవసరమైతే రక్త పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని అన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. పరిశుభ్రమైన నీటిని త్రాగాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, వేడి ఆహారాన్ని మాత్రమే తినాలని సూచించారు. ఇటీవల ఏరియా ఆసుపత్రికి పాము కాటుకు గురైన కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లే ప్రజలు పాముకాటు రక్షణ బూట్లు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

అనుమానాస్పద స్థితిలో ఇంటిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్లూరులో శనివారం వెలుగులోనికి వచ్చింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం కోన శ్రీనివాసరావు (52) అను వ్యక్తి ఇంట్లో ఒద్దెకు ఉంటున్నారు. నాలుగు రోజుల నుంచి కనిపించపోగా ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు 100 కాల్ చేయగా పోలీసులు వచ్చి తలుపులు తీసి పరిశీలించారు. అనుమానాస్పద స్థితిలో వ్యక్తి పడి ఉండటాన్ని గుర్తించారు.

మాట్లాడుతున్న బాపట్ల ఎడిఎ కె ధనరాజ్

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - అమృతలూరు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా వ్యవసాయ సహాయకుల రైతులకు అందుబాటులో ఉండాలని బాపట్ల ఎడిఎ కె ధనరాజ్ సూచించారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో నూతనంగా వచ్చిన వ్యవసాయ సిబ్బందికి ఎఒ, ఎఇఒ, విఎఎలు, ఉద్యానవన సహాయకులతో మాట్లాడారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల డీలర్లకు ఎఒ ఎం హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులు తీసుకున్న రైతులకు బ్యాంకు నుండి రుణాలు ఇప్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ బి మణికంఠ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భార్గవ్

శక్తి యాప్ పట్ల అవగాహన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'శక్తి యాప్' పట్ల అవగాహన కలిగి ఉండాలని నగరం ఎస్ఐ భార్గవ్ సూచించారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల్లో ఎస్పి తుషార్ డూడి ఆదేశాల మేరకు రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం ఇంచార్జి నగరం ఎస్ఐ భార్గవ్ సదస్సు ఏర్పాటు చేశారు. యాప్‌ను ఉపయోగించుకునే పద్ధతిని వివరించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, ఆపదలో ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్‌ను రక్షణ సాధనంగా ఎలా ఉపయోగించుకోవాలో తెలిపిందని విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంపి వెంకట్రావు, పరిపాలన అధ్యక్షులు పణి కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-మార్కాపురం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారమైన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని హెచ్చరించారు. ఈపాటికే విద్యుత్ బిల్లులో ప్రజలు వాడిన విద్యుత్ కన్నా అదనపు ఛార్జీలు భారీగా ప్రజల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ మీటర్లలో భారీగా మార్పులు వస్తాయని ప్రజలకు హెచ్చరిక చేశారు. పిక్ అవర్ పేరుతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో అధిక బిల్లు వసూలుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు బిగింపుకు ఆదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని, సుమారుగా రూ.25 వేల కోట్లు ప్రజలపై భారం పడుతుందన్నారు. ఈ భారాన్ని ప్రజల నుంచి వసూలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. అదాని కంపెనీ లాభం కోసం ఇలాంటి చర్యలకు పూనుకోవడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రాలలో ప్రతి ఇంటికీ అదాని మీటరు బిగించాలని మోడీ ప్రభుత్వం హుకుం జారీ చేస్తే... రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం గుడ్డిగా సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు బిగించడానికి అంగీ కరించిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతి రేకించి, పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలో వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం మోసపూరి తమన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, ప్రజలపై విద్యుత్ భారాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. సోమయ్య, మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, పట్టణ కార్యదర్శి డికెఎం.రఫీ, తురకా ఏడుకొండలు, జి.రాజశేఖర్‌రెడ్డి, వై.పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి,- ఒంగోలు సిటీ

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె శనివారం నాటికి ఏడో రోజుకు చేరింది. పారిశుధ్య కార్మికుల సమ్మె నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా అర్ధనగ్న ప్రదర్శన రనిర్వహించారు. అంబేద్కర్ భవన్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వేతనాల పెంపు కోసం ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అధికారంలోకి రాకముందు టిడిపి నాయకులు కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించి,తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని వాగ్ధానం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. గత ఏడేళ్లుగా వేతనాలు పెరగక కుటుంబాలు గడవక కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నిత్యావసర ధరలు పెరిగి, కనీసం వేతనం రూ.26,000 అమలు కాక, కేవలం రూ.15,000లతో ఇంటి అద్దె, పిల్లల చదువులు, వైద్యం, కుటుంబ అవసరాలు తీర్చుకోలేక ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సమ్మెకాలపు ఒప్పందం ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు అమలు చేయలేదని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రత్యేక పారిశుధ్య కార్మికులుగా పనిచేసిన వారికి కూడా వేతనాలు పెంచలేదన్నారు. రూ.12వేలు జీతంతో ఎలా బతకాలో అర్ధం కావడంలేదని కార్మికులు వాపోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కె. సామ్రాజ్యం, యు.కుమారి, జి.నరసింహ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.బాబు, వై.రవి, ఎ.అబ్రహాం, డి.మరియ బాబు, కె.పద్మ, కె.శ్రీదేవి, శివమ్మ, కె.జానయ్య, కె.మోహన్ రావు, లక్ష్మీ ప్రసన్న, వెంకట్రావు, రూతుమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు స్టేషన్లు, కార్యాలయాలను శుభ్రం చేశారు. చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. పబ్లిక్ ప్రదేశాలు, ప్రకతిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, పర్యావరణ అభివృద్ధి, పరిశుభ్రమైన వాతావరణం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పి తుషార్ డూడి ఆదేశాల మేరకు ఎఆర్ డిఎస్పి విజయ సారధి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటి ఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు, ఎఆర్ సిబ్బంది పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ , ఎస్పి క్యాంప్ కార్యాలయం లోని పరిసరాలను శుభ్రం చేశారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసు సిబ్బంది

బాపట్లను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్లను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత చెత్త డంపింగ్ యార్డు వద్ద విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే నష్టం గురించి వివరించారు. ఈ తరం ప్రజలు చేస్తున్న పొరపాట్లు రాబోయే తరాలకు నష్టాన్ని కలిగించరాదన్నారు. చెత్తతో భూమి, వాయువు, జలాలు కాలుష్యం గాకుండా ప్రజలు, పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు చైతన్యంతో భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని కోరారు. విద్యార్థులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేన్సర్‌కు కారణమయ్యే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలకు మార్గనిర్దేశం చేశామన్నారు. జిల్లాలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను 70 శాతం జిందాల్‌కు తరలించినట్లు తెలిపారు. చెత్త నుంచి సంపద సష్టించే కార్యక్రమంపై దష్టి సారించామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు పూర్తిగా నిలిపి వేయాలన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జిల్లాలో విస్తతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణలో కలెక్టర్ బాగా పనిచేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలు మరింత విస్తతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవ్యూ అధికారి, పురపాలక సంఘం ప్రత్యేక అధికారి జి.గంగాధర్ గౌడ్, డిపిఒ ప్రభాకర్ రావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఆర్‌డిఒ గ్లోరియా, సిపిఒ షాలేమ్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వారం రోజులుగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని కార్మికులు సమ్మెలో ఉన్నారు. ఇంజినీరింగ్ ,వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానికులు,స్ట్రీట్ లైటింగ్,టౌన్ ప్లానింగ్,కంప్యూటర్ ఆపరేటర్లు,కార్మికులకు సీల్డ్,సెమీ స్కిల్డ్ జీవో నెంబర్ 36 వేతనాలు అమలు చేయాలని కోరుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, ఇంజినీరింగ్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతున్నారు.నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి కుటుంబాల పై ఆర్థిక భారాలు పడుతున్నాయని విద్య, వైద్యం కోసం అప్పులు చేయాల్సి వస్తుందని, రూ.15 వేల వేతనంతో జీవనం కష్టంగా ఉంటుందని కార్మికులు చెబుతున్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతున్నారు.

పొగాకు కొనుగోళ్ళు మందకొడిగా ఉన్నాయి. ఇప్పటివరకూ రూ. 25 కోట్ల విలువైన పొగాకును కొనుగోలు చేశారు.కొనుగోలు కేంద్రాలను పెంచి వేగంగా పొగాకు కొనాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో పొగాకు తడవకుండా కాపాడుకోవడం కష్టమని,ఆలస్యం అయ్యే కొద్ది పొగాకు నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్లాకుబర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు హామీ ఇస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎమ్మెల్యేలు, నేతలు విస్తృతంగా తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఏడాది కాలంలో తాము చేసిన పనుల గురించి ప్రజలకు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందంటూ వైసిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ, మోసం గ్యారంటీ అనే నిర్వహిస్తున్నారు.

బాపట్లను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలకు ఆదేశాలిచ్చారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రజలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలు వినియోగించుకున్న విద్యుత్ కన్నా అదనపు చార్జీల భారం పడే పరిస్థితి ఉంది. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ మీటర్లలో భారీగా మార్పులు రాబోతున్నాయి. పీక్ అవర్ పేరుతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో అధిక బిల్లు వసూళ్ళు చేస్తారు. స్మార్ట్ మీటర్ల గురించి ప్రజలకు అంతగా అవగాహన లేకపోవడంతో సిపిఎం, ప్రజాసంఘాలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల కలిగే నష్టం గురించి వివరిస్తున్నారు. అదాని కంపెనీ లాభం కోసం రాష్ట్రాలలో ప్రతి ఇంటికి అదాని మీటరు బిగించాలని మోడీ ప్రభుత్వం హుకుం జారీ చేస్తే రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం గుడ్డిగా సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు బిగించడానికి అంగీకరించిందని ఇది నష్టదాయకమని వివరిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలో వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం మోసపూరితమని, అందువలన స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని ప్రజలకు తెలియజేస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పి4 కార్యక్రమంలో అధికారులంతా తలమునకలవుతున్నారు.బంగారు కుటుంబాల గుర్తింపు వారిని దత్తత తీసుకునే మార్గదర్శుల ఎంపికల్లో ఉన్నారు. బంగారు కుటుంబాల ఎంపిక చేస్తున్నారు. సంవత్సర ఆదాయం రూ.50 లక్షలు ఉన్న వారినే మార్గదర్శకులుగా ఎంపిక చేస్తున్నారు. ఒక్కో మార్గదర్శికి 10 బంగారు కుటుంబాలను కేటాయించనున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా మార్గదర్శకులుగా చేరుస్తున్నారు. బంగారు కుటుంబం, మార్గదర్శకుల ఎంపికను ఈనెల 25 లోపు పూర్తి చేయనున్నారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా